





PRGI NO: TGTEL/26/A0383

డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక

నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

తెలంగాణ బుధవారం 09- 09 -2026 సంపుటి: 01 సంచిక : 236 పేజీలు : 12

## పోలీసుల ఎదుట యూట్యూబర్ నందన.

- నాకేం తెలియదు, అంతా భర్తే చూసుకున్నాడంటూ వాదన.
- వీసా మోసం కేసులో పోలీసుల విచారణకు హాజరైన యూట్యూబర్ నందన.
- ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడి.
- వీసా పనులన్నీ తన భర్తే చూసుకున్నారని పోలీసులకు వివరణ.
- సమాధానాలు సరిగా లేవని, మళ్లీ విచారణకు రావాలని నోటీసులు జారీ.
- నందనతో పాటు ఆమె భర్త, మామగారిపై కూడా కేసు నమోదు.



2

# కేసీఆర్ ఇక అసెంబ్లీకి రానట్లేనా?

## వస్తే సీఎంగానే వస్తారా?

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**

*ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అసెంబ్లీలో అనుచిత భాష వాడుతున్నారని, బూతులు మాట్లాడుతున్నారని, అలాంటి గౌరవం లేని సభకు తాను వెళ్లనని కేసీఆర్ చెప్పిన సంగతి తెలిసిందే. కేసీఆర్ వెళ్లాల్సిన అసెంబ్లీకి వెళ్లాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి హరీశ్రావు స్పష్టం చేశారు. ఎర్రవెల్లిలో కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.*

ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నేతలు సభలో అవమానాలు ఎదుర్కొన్నప్పుడు ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ సీఎంగానే అడుగుపెట్టారని, కేసీఆర్ కూడా అదే బాటలో మళ్లీ సీఎంగానే అసెంబ్లీలోకి వస్తారని పేర్కొన్నారు. ఈ మధ్య కేటీఆర్కూడా ఇదే మాట చెప్పారు. కేసీఆర్ తాను చెప్పినట్లుగానే ఈ రోజు నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. కేసీఆర్ నిర్ణయానికి పార్టీ మద్దతు ఉంది. తండ్రిని కేటీఆర్, మామను హరీష్ రావు పూర్తిగా సమర్థించారు.

కేటీఆర్, హరీశ్రావు చెప్పిన "కేసీఆర్ అసెంబ్లీకి వస్తే సీఎంగానే వస్తారు" అన్న మాటను రాజకీయ ప్రకటనగా చూడాలి. దాని ఆధారంగా "ఇంకో రెండేళ్లు ఖచ్చితంగా కేసీఆర్ అసెంబ్లీకి రారు" అని తేల్చడం సరైంది కాదు. 2028 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆయన సభకు రాకపోవచ్చనే రాజకీయ సంకేతం మాత్రం అందులో ఉంది.


ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం: 2025 డిసెంబర్లో కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. ఆ

2



## తల్లి కోసం యువకుడి ప్రయాణం

- 20 ఏళ్ల బీహార్ యువకుడి ఫ్రీలాన్సింగ్ కథ వైరల్.
- 14 ఏళ్లకే డిజైన్, ఎడిటింగ్ నేర్చుకున్న కుర్రాడు.
- డిగ్రీ చదవకుండా వెబ్3 రంగంలోకి ప్రవేశం.
- నెలకు 4,000 డాలర్లు సంపాదిస్తున్నానని వెల్లడి.
- గత నెలలో 6,500 డాలర్లు వచ్చాయని వెల్లడి.



2

## రేవంత్ రెడ్డి 'చిల్లర నా కొడుకు'..

### సీఎంపై నోరు జారిన కేటీఆర్...!

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదంతో తెలంగాణ రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. తెలంగాణ మంచి కోసం కేసీఆర్ చావును కోరుకుంటున్నానని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈరోజు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఈ విషయాన్ని మరింత బలపరిచాయి. హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులతో కలిసి కేసీఆర్ ఫామస్కు వెళ్తున్న కేటీఆర్ ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు, ఉద్రిక్తతను తగ్గించేందుకు ప్రయత్నించిన స్థానిక పోలీసులకు, కేటీఆర్కు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ సమయంలోనే కేటీఆర్ తన సహజ స్వభావానికి భిన్నంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన, "రేవంత్ రెడ్డి ఒక చిల్లర నా కొడుకు. వాడు కేసీఆర్ను చంపడానికి ప్రయత్నిస్తున్నాడు" అని అన్నారు. ముఖ్యమంత్రిపై కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్య చాలా తీవ్రమైంది.

తెలంగాణ రాజకీయాల్లో పెరిగిన ఉద్రిక్తతను ఇది

2



# బయటపడ్డ హిజ్రాల పక్కా కమీషన్ దందా!

- శుభకార్యాలకు హిజ్రాలు ఎలా వస్తారనే రహస్యంపై ఓ హిజ్రా స్పష్టత
- టెంట్ హౌస్‌లు, పంతుళ్లు, వాచ్‌మెన్ల నుంచి సమాచారం అందుతుందని వెల్లడి
- ఒక్కో ఫంక్షన్ లోకేషన్ చెప్పినందుకు రూ.2000 నుంచి రూ.3000 కమీషన్
- కొందరి వల్లే తమందరికీ చెడ్డపేరు వస్తోందని ఆవేదన

2



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం.
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ.
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం.
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్.



2

# కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం.
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ.
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ.
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్.
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్.

2



## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

- బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్.
- అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి.
- తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష.

2

# పోలీసుల ఎదుట యూట్యూబర్ నందన.

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
వీసాల పేరిట డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో ప్రముఖ యూట్యూబర్ నందన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వ్యాపార వ్యవహారాలన్నీ తన భర్త మధుకరే చూసుకున్నాడని ఆమె విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన విచారణలో ఆమె పలు కీలక ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడంతో, మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. విచారణ అనంతరం ఇబ్రహీంపట్నం సీఐ మీడియాకు వివరాలు వెల్లడించారు. "లుకౌట్ నోటీసుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు నందనను అదుపులోకి తీసుకుని మాకు సమాచారం ఇచ్చారు. మా సిబ్బంది వెళ్లి నోటీసులు జారీ చేయగా, దాని ప్రకారం ఆమె ఇవాళ విచారణకు వచ్చారు. అయితే, చాలా ప్రశ్నలకు ఆమె నుంచి 'నాకు తెలియదు' అనే సమాధానమే వచ్చింది. దీంతో ఈ నెల 16వ తేదీన మళ్లీ విచారణకు రావాలని మరో నోటీసు ఇచ్చి పంపించాం" అని ఆయన తెలిపారు. విచారణలో నందన తన వాదనను స్పష్టంగా వినిపించినట్లు సమాచారం. తాను కేవలం ఐటీ ఉద్యోగిని, యూట్యూబర్‌ను మాత్రమేనని, వీసాల కన్సల్టెన్సీతో గానీ, దాని ఆర్థిక లావాదేవీలతో గానీ తనకు సంబంధం లేదని ఆమె చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. కంపెనీ వ్యవహారాలు, వీసాల జారీ, డబ్బుల వసూళ్లు వంటివన్నీ తన భర్త మధుకరే చూసుకుంటాడని, ఆ కంపెనీలో తాను డైరెక్టర్ హోదాలో గానీ, ఉద్యోగిగా గానీ లేనని ఆమె స్పష్టం చేశారు. నందన మొత్తం బాధ్యతను భర్త మధుకర్‌పై నెట్టడంతో ఇప్పుడు ఈ కేసులో ఆయన పాత్రపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో నందన, ఆమె భర్త, మామగారి పేర్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నందన వాంగ్మూలంతో ప్రస్తుతం విదేశాల్లో ఉన్న మధుకర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు కనిపిస్తోంది. తదుపరి విచారణలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. తన విచారణ ముగిశాక, తన భర్తను విచారణకు పంపిస్తానని నందన చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం భర్త పిల్లలను చూసుకుంటున్నాడని, తాను వెళ్లాక ఆయన భారత్ వస్తాడని ఆమె చెప్పినట్టు వెల్లడించారు. ఈ కేసులో నందనతో పాటు ఆమె భర్త, మామగారిపై కూడా ఫిర్యాదు ఉందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర**
స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ ఛైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.



# కేసీఆర్ ఇక అసెంబ్లీకి రానట్లేనా?

సందర్భంగా రేవంత్రెడ్డి, కేసీఆర్ ఇద్దరూ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సభలో పరస్పరం మాట్లాడుకున్నారు. కాబట్టి "2023 డిసెంబర్ నుంచి ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు" అనడం కూడా పూర్తిగా సరైనది కాదు.

**కేసీఆర్ ఎందుకు దాదాపుగా అసెంబ్లీకి దూరంగా ఉన్నారు?**
దీనికి ఒక్క అధికారిక కారణం లేదు. రాజకీయంగా చూస్తే కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. ఓటమి తర్వాత నేరుగా రేవంత్తో సభలో తలపడకూడదనే వ్యూహం ఉంది. 2023 ఎన్నికల్లో BRS అధికారాన్ని కోల్పోయింది. కేసీఆర్ గజ్వేల్లో గెలిచినా, కామారెడ్డిలో రేవంత్రెడ్డి, బీజేపీ అభ్యర్థి మధ్య పోటీలో మూడో స్థానంలో నిలిచారు. అలాంటి పరిస్థితిలో అసెంబ్లీలో ప్రతిరోజూ కూర్చుని కొత్త ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో ప్రత్యక్ష రాజకీయ పోరాటం చేయడం కంటే, KTR-హరీశ్రావు వంటి నాయకులను ముందుకు పంపడం BRS వ్యూహంగా కనిపిస్తోంది.

"మాజీ సీఎం"గా కాకుండా "తిరిగి వచ్చే సీఎం"గా తన ఇమేజ్ను నిలబెట్టుకోవడం అనే ఆలోచన చేస్తున్నారు. ఖు=, హరీశ్ రావు చెబుతున్న "కేసీఆర్ వస్తే సీఎంగానే వస్తారు" అనే మాటలో అసలు రాజకీయ సందేశం ఇదే. అంటే... "కేసీఆర్ ఇక ప్రతిపక్ష నాయకుడిగా కూర్చుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తి కాదు. తదుపరి ఎన్నికల్లో BRS గెలిస్తే మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే నాయకుడు." అందుకే ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నిరంతరం కనిపించకపోవడం కూడా ఒక political positioning చూడవచ్చు.

కేసీఆర్ను సభకు తీసుకురావడం BRSకు కొంత ఇబ్బందికరమైన రాజకీయ పరిస్థితి కూడా కావచ్చు. కేసీఆర్ సభకు వస్తే సహజంగానే రేవంత్రెడ్డి ప్రభుత్వం ఆయన పాలనపై ప్రశ్నలు వేస్తుంది. అదే సమయంలో BRS పాలనలో జరిగిన నిర్ణయాలపై సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అంటే సభలో కేసీఆర్కు రెండు పాత్రలు వస్తాయి: గత ప్రభుత్వానికి బాధ్యత వహించిన మాజీ సీఎం, మరొకటి ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేత. రెండో పాత్ర కంటే మొదటి పాత్రపై కాంగ్రెస్ ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉంటుంది. BRSలో ప్రస్తుతం KTR-హరీశ్రావు ఫ్రంట్లైన్లో ఉన్నారు.
ప్రస్తుత అసెంబ్లీ రాజకీయాల్లో KTR, హరీశ్రావు, ఇతర BRS ఎమ్మెల్యేలే కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజువారీగా పోరాడుతున్నారు. ఈరోజు కూడా KTR, హరీశ్రావు తదితర BRS ఎమ్మెల్యేలు అసెంబ్లీ వెలుపల కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకు దిగారు. అంటే BRSలో ఒక రకంగా "కేసీఆర్ పార్టీకి పెద్ద నాయకుడు/భవిష్యత్ సీఎం. KTR-హరీశ్ = రోజువారీ అసెంబ్లీ పోరాటం" అనే విభజన కనిపిస్తోంది. కానీ మరో కోణం కూడా ఉంది. ఇది కేవలం కేసీఆర్ తీసుకున్న రాజకీయ నిర్ణయమే అని చెప్పలేం.
ఆయన ఆరోగ్యం, వయసు, 2023 ఎన్నికల తర్వాత పార్టీ పరిస్థితి, సభలో తన ప్రత్యక్ష హాజరుతో వచ్చే రాజకీయ పరిణామాలు--- ఇవన్నీ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అయితే ఆయన అసెంబ్లీకి రాకపోవడానికి "రేవంత్రెడ్డిని ఎదుర్కోలేక" లేదా "భయంతో" అనే ఒక్క కారణాన్ని నిర్ధారించే ఆధారం లేదు. అదే సమయంలో కాంగ్రెస్ మాత్రం దీనిని తీవ్రంగా రాజకీయ అంశంగా మార్చుతోంది. మార్చిలో రేవంత్రెడ్డి, కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోయినా జీతం-అలవెన్సులు తీసుకుంటున్నారని విమర్శించారు. తాజాగా "అసెంబ్లీకి రావాలి లేదా ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి" అని రేవంత్ సవాల్ చేశారు.

**ఇంకో రెండేళ్లు రారా?**
అలా జరిగే అవకాశం ఉంది. కానీ ఖచ్చితంగా చెప్పలేం. 2028 ఎన్నికలకు ముందు ఒక కీలక అసెంబ్లీ సమావేశంలో కేసీఆర్ స్వయంగా వచ్చి "నేను మళ్లీ ముఖ్యమంత్రి అవుతాను" అనే రాజకీయ సందేశం ఇవ్వడం దీ=ాకు చాలా పెద్ద ప్రచార కార్యక్రమంగా మారవచ్చు. మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన గైర్హాజరీని ఎంత ఎక్కువగా రాజకీయంగా ఉపయోగిస్తే, BRS కూడా ఏదో ఒక దశలో కేసీఆర్ను సభలోకి తీసుకురావాల్సిన ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉంది.
కాబట్టి KTR--హరీశ్రావు మాటలను ఇలా అర్థం చేసుకోవచ్చు. "కేసీఆర్ ఇక సాధారణ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కూర్చోరు. తదుపరి అధికార పోరాటం కోసం ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగానే ప్రొజెక్ట్ చేస్తాం." ఇది 2028 వరకు అసెంబ్లీకి రానన్న రాజ్యాంగ పరమైన/అధికారిక నిర్ణయం కాదు. రాజకీయ వ్యూహానికి సంబంధించిన ప్రకటన.

# రేవంత్ రెడ్డి 'చిల్లర నా కొడుకు'..

మొదటి పేజీ తరువాయి..
ప్రతిబింబిస్తుంది. అనంతరం కేటీఆర్, హరీష్ రావులు తెలంగాణ పోలీసులతో వాగ్వాదానికి దిగి, కేసీఆర్ అధికారిక నివాసం వైపు నడవడం ప్రారంభించారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకత్వం మధ్య జరిగిన ఈ తీవ్ర వాగ్వాదం రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయానికి నాంది పలుకుతోంది. ప్రస్తుతం కేసీఆర్ నివాసంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకృతమై, చర్చలకు కేంద్ర బిందువుగా కనిపిస్తోంది.
బాధ్యత గల నాయకుడిగా కేటీఆర్ ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించడం సరైంది కాదు. రాజకీయ నాయకులు ఒకరి విధానాలను, నిర్ణయాలను, అవినీతి ఆరోపణలను లేదా పరిపాలనా వైఫల్యాలను ఎంత తీవ్రంగా అయినా విమర్శించవచ్చు. కానీ "నా కొడుకు" వంటి కుటుంబాన్ని/వ్యక్తిని కించపరిచే భాష చర్చను విషయాల నుంచి వ్యక్తిగత దూషణల వైపు తీసుకెళ్తుంది. అదే సమయంలో, గత కొన్ని రోజులుగా ఇరుపక్షాల నేతల మధ్య "బూతులు", "చిల్లర రాజకీయాలు" వంటి పరస్పర ఆరోపణలతో భాష మరింత తీవ్రంగా మారుతోంది.

ఇది ఎందుకు సమస్య?
పదవికి గౌరవం:
రేవంత్రెడ్డి ముఖ్యమంత్రి. కేటీఆర్ కూడా మాజీ మంత్రి వారి మాటలు సాధారణ వ్యక్తుల మాటల కంటే ఎక్కువ ప్రభావం చూపుతాయి. విమర్శకు హద్దు ఉండాలి: "మీ ప్రభుత్వం ఈ హామీని నెరవేర్చలేదు", "ఈ నిర్ణయం ప్రజలకు నష్టం చేస్తోంది" అనడం రాజకీయ విమర్శ. కానీ వ్యక్తిగత దూషణ దానికి భిన్నం.
ప్రజా చర్చ దిగజారుతుంది:
నాయకులు పరుష భాష వాడితే కార్యకర్తలు, సోషల్మీడియా అనుచరులు అదే భాషను మరింత తీవ్రంగా ఉపయోగించే అవకాశం ఉంటుంది.
అసలు సమస్యలు మరుగునపడతాయి:
తెలంగాణలో ఉద్యోగాలు, రైతులు, సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ హామీలు వంటి అంశాలపై సమాధానాలు కావాల్సిన సమయంలో ఎవరు ఎవరిని తిట్టారన్నదే ప్రధాన చర్చగా మారుతుంది.
అయితే ఇది కేటీఆర్కు మాత్రమే వర్తించే ప్రమాణం కాదు. రేవంత్రెడ్డి గానీ, కాంగ్రెస్ నేతలు గానీ, బీఆర్ఎస్ నేతలు గానీ--- ఎవరైనా ప్రత్యర్థిని వ్యక్తిగతంగా అవమానించే భాష వాడితే అదే తప్పు. ఇటీవల బీఆర్ఎస్ నేతలు కూడా రేవంత్రెడ్డి పాలనపై "బూతుల పాలన", "చిల్లర రాజకీయాలు" వంటి తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు.
కేటీఆర్ రేవంత్రెడ్డిని రాజకీయంగా ఎంత తీవ్రంగా విమర్శించినా పర్వాలేదు. కానీ వ్యక్తిగత దూషణ మాత్రం సమర్థించదగిన రాజకీయ సంస్కృతి కాదు. ప్రజలు నాయకుల నుంచి "ఎవరు ఎక్కువగా తిట్టారు?" అనే పోటీని కాకుండా "ఎవరి దగ్గర మంచి పాలనా సమాధానాలు ఉన్నాయి?" అనేదే చూడాలి.

# తల్లి కోసం యువకుడి ప్రయాణం

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
చదువు పూర్తిచేసి ఉద్యోగం సంపాదించాలి.. ఇదే చాలామంది యువత ఆలోచన. కానీ బీహార్‌కు చెందిన ఓ 20 ఏళ్ల యువకుడు మాత్రం అందుకు భిన్నమైన దారిని ఎంచుకున్నాడు. 14 ఏళ్ల వయసులో డిజైన్, వీడియో ఎడిటింగ్ నేర్చుకున్నాడు. మధ్యలో ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయి. చివరికి ఫ్రీలాన్సింగ్, వెబ్3 రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. డిగ్రీ లేకుండానే నెలకు వేల డాలర్లు సంపాదిస్తున్నానంటూ రెడిట్‌లో తన కథను పంచుకున్నాడు. అతడి జర్నీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తల్లిదండ్రులు విడిపోయిన తర్వాత ఐదేళ్ల వయసు నుంచి తల్లి వద్దే పెరిగినట్లు ఆ యువకుడు తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులతో సాగిన బాల్యంలోనే ఏదైనా చేయాలన్న ఆలోచన వచ్చిందని చెప్పాడు. 2020లో 14 ఏళ్ల వయసులో ఆన్‌లైన్‌లో డిజైన్, ఎడిటింగ్ నేర్చుకున్నాడు. అప్పట్లో పబ్‌జీ ఈస్పోర్ట్స్ జట్ల కోసం గ్రాఫిక్స్ రూపొందించేవాడు. కొంతకాలానికే పబ్‌జీపై భారత్‌లో నిషేధం రావడంతో ఆ పని ఆగిపోయింది. 2024లో 12వ తరగతి పూర్తయ్యే వరకు ఫ్రీలాన్సింగ్ చేయాలా? ఉన్నత చదువులు కొనసాగించాలా? అనే సందిగ్ధంలో ఉన్నాడు. అదే సమయంలో నోయిడాలో వెబ్3 మార్కెటింగ్ ఏజెన్సీ ప్రారంభిస్తున్న పాత పరిచయస్థుడి నుంచి అవకాశం వచ్చింది. కాలేజీకి వెళ్లకుండా నోయిడా చేరాడు. నెలకు రూ.15 వేల జీతంతో పని మొదలుపెట్టాడు. భోజనం, వసతి కూడా సంస్థే కల్పించింది. అయితే ఆ ఉద్యోగం సులభంగా సాగలేదు. ఖాళీ గదిలో ఒక పరుపు, ట్రాలీతోనే కొంతకాలం గడిపినట్లు చెప్పాడు. 18 ఏళ్లకే మద్యం, గంజాయి అలవాట్లకు లోనయ్యానని వెల్లడించాడు. ఐదు నెలల తర్వాత ఉద్యోగం వదిలి బీహార్‌కు తిరిగొచ్చాడు. మళ్లీ కొంతకాలం ఒంటరితనం, నిరాశ వెంటాడాయి. ఆ తర్వాత టెక్నాలజీ కమ్యూనిటీలకు ఉచితంగా బ్రాండ్, లోగో డిజైన్లు చేయడం మొదలుపెట్టాడు. నెలకు 200-300 డాలర్లు సంపాదించేవాడు. తర్వాత వెబ్3 రంగంలో మరో పరిచయం ద్వారా సోషల్ మీడియా గ్రాఫిక్స్ పని దక్కింది. క్రమంగా క్లయింట్లు పెరిగారు. డిజైన్ పనులతో మొదలైన ప్రయాణం వెబ్3 సేవల వరకు వెళ్లింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.12 లక్షలు సంపాదించినట్లు అతడు చెప్పాడు. నెలకు 2,000 డాలర్ల నుంచి 4,000 డాలర్లకు ఆదాయం పెరిగిందని తెలిపాడు. గత నెలలో ఏకంగా 6,500 డాలర్లు, అంటే సుమారు రూ.5.7 లక్షలు సంపాదించినట్లు పేర్కొన్నాడు. తన ఆదాయంతో అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకున్నానని, ఎప్పటినుంచో కలగా ఉన్న మ్యాక్‌బుక్ ప్రో కొనుక్కున్నానని చెప్పాడు. అంతేకాదు.. తల్లిని ఆర్థికంగా ఉద్యోగం అవసరం లేని స్థితికి తీసుకొచ్చానని, ప్రతి కొన్ని నెలలకు బంగారం కొంటున్నానని తెలిపాడు. ఇన్నాళ్లూ అద్దె ఇంట్లోనే ఉన్న తమ కుటుంబం కోసం స్థలం లేదా ఫ్లాట్ కొనుగోలుకు కూడా డబ్బు దాచుకుంటున్నట్లు వెల్లడించాడు. అయితే డబ్బు సంపాదించినా తన జీవితంలో కొన్ని విషయాలు కోల్పోయానని ఆ యువకుడు అంగీకరించాడు. ఇప్పటికీ ఒంటరితనం ఉందని, స్నేహితులు చాలా తక్కువ మందేనని చెప్పాడు. తన కథను గొప్పలు చెప్పుకోవడం కోసం కాకుండా.. తమ పరిస్థితులు మారాలని ప్రయత్నిస్తున్న వారికి స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతో పంచుకున్నానని పేర్కొన్నాడు.

# బయటపడ్డ హిజ్రాల పక్కా కమీషన్ దందా!

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
చింతల్ ఘటన తర్వాత నెట్టింట చర్చనీయాంశమైన హిజ్రాల నెట్‌వర్క్ శుభకార్యాలు, వేడుకలు జరిగే ప్రదేశాలకు హిజ్రాలు కచ్చితంగా ఎలా వస్తారు? ఎక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా వారికి ముందుగా సమాచారం ఎలా అందుతుంది? ఈ ప్రశ్నలు చాలామంది మదిని తొలిచేవే. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశం సందర్భంగా హిజ్రాలు ప్రవర్తించిన తీరుపై తీవ్ర దుమారం రేగడంతో వారి సమాచార వ్యవస్థపై చర్చ మొదలైంది. దీని వెనుక ఓ పక్కా వ్యవస్థ, పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.
ఇంతకీ వీరికి సమాచారం ఎలా అందుతుందంటే.. దీని వెనుక పక్కా కమీషన్ దందా నడుస్తోందని ఓ హిజ్రా స్వయంగా ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాల వంటి శుభకార్యాల వివరాలను తమకు చేరవేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేస్తారని ఆమె తెలిపారు. వారి ద్వారానే తమకు ఫంక్షన్ల లోకేషన్లు తెలుస్తాయని వివరించారు.
సమాచారం ఇచ్చేది వీరే.
ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శుభకార్యాలకు సంబంధించిన వ్యక్తులే హిజ్రాలకు ప్రధాన ఇన్ఫార్మర్లు.
టెంట్ హౌస్ వాళ్లు: ఫంక్షన్‌కు టెంట్లు, కుర్చీలు సరఫరా చేసేవారు.
పంతుళ్లు: పూజలు, శుభకార్యాలు జరిపించే పురోహితులు.
గోమాతను తెచ్చేవారు: గృహప్రవేశాల వంటి వాటికి గోమాతను తీసుకువచ్చేవారు.
సన్నాయి మేళం వాళ్లు: ఫంక్షన్లలో సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు.
బిల్డర్లు, వాచ్‌మెన్లు: కొత్తగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో పనిచేసేవారు.

ఈ వ్యక్తులు ఫలానా చోట ఫంక్షన్ జరుగుతోందని ముందుగానే తమకు ఫోన్ చేసి లోకేషన్ పంపిస్తారని సదరు హిజ్రా తెలిపారు.
లోకేషన్‌కు రూ.3000 కమీషన్
కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దీనికి వారు కమీషన్ కూడా తీసుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం. గతంలో ఒక్కో లోకేషన్‌కు రూ.200 నుంచి రూ.500 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.2000 ఇవ్వనిదే ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ముఖ్యంగా గృహప్రవేశానికి గోమాతను తీసుకొచ్చేవారు రూ.3000 వరకు డిమాండ్ చేస్తారని, అంత ఇస్తేనే గానీ అడ్రస్ చెప్పరని వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో ఎవరు ముందుగా సమాచారం ఇస్తే, వారికే కమీషన్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

కొందరి వల్లే అందరికీ చెడ్డపేరు
చింతల్ ఘటనపై స్పందిస్తూ, కొందరు హిజ్రాలు మాత్రమే డబ్బుల కోసం దౌర్జన్యంగా ప్రవర్తిస్తారని, వారి వల్లే తమ వర్గం మొత్తానికి చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కడుపు నింపుకోవడానికే ఈ పని చేస్తామని, చాలామంది ఎంత ఇస్తే అంత తీసుకుని ఆశీర్వదించి వెళ్లిపోతారని చెప్పారు. కొందరు దాతలు తమను స్వయంగా ఇళ్లకు పిలిపించుకుని గౌరవిస్తారని గుర్తుచేశారు. ఏదేమైనా శుభకార్యాల వద్ద హిజ్రాల సందడి వెనుక ఇంత పెద్ద కమీషన్ నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 8:**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.
కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.



# తాతా మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు.
- కేసముద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన.. నల్లబ్యాడ్జీలతో ఆందోళన.
- దళిత సమాజాన్ని అవమానించేలా వ్యవహరించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధం: సమ్మిగౌడ్.





**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనను శాసన మండలి సభ్యత్వం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని కేసముద్రం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సమ్మిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి, దళిత సమాజానికి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనంటూ నినాదాలు చేశారు. తాతా మధుపై తక్షణమే అనర్హత వేటు వేసి శాసన మండలి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మిగౌడ్ మాట్లాడుతూ, ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి తాతా మధు మాట్లాడిన తీరు అత్యంత అభ్యంతరకరంగా ఉందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కించపరిచే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. తాతా మధుపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు శాసన మండలి సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆ పదవిలో ఉన్న దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరరావు, రావుల మురళి, బండారు వెంకన్న, కదిర సురేందర్, వల్లందాసు రవి, తరాల వీరేష్, రాంబాబు, రడెం వెంకన్న, రడెం శ్రీనివాస్, పోలెపాక నాగరాజు, ఆయూబ్ ఖాన్, శ్రీహరి, దామరకొండ ప్రవీణ్, సామల నరసయ్య, కొలిపాక వెంకన్నతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.

- చికిత్స కన్నా నివారణ ముఖ్యం.
- అవగాహనతో ముందుకు వెళ్ళండి.

**మరిపెడ,సెప్టెంబర్ 08(జనం వాయిస్).** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడ లో బాలికల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా హెచ్‌పీవీ(ఎచ్ పి వి)వ్యాక్సిన్‌పై ప్రత్యేక అవగాహన సదస్సును ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నందిగామ జనార్ధనా చారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జనార్ధనా చారి మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ,మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సర్వైకల్ క్యాన్సర్)బారిన పడకుండా ఉండటానికి కౌమార దశలోనే హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. 14,15 సంవత్సరాల బాలికలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా శరీరంలో బలమైన రోగనిరోధక శక్తి ఏర్పడి భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ ముప్పును నివారించవచ్చని వివరించారు. టీకా పూర్తిగా సురక్షితమైనదని,ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని విద్యార్థినులకు,తల్లిదండ్రులకు సూచించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కావేటి మంగమ్మ,ఎస్. వి. ఎస్ ఆచార్యులు,నాగమణి,అనసూర్య లు మరియు మహిళా ఉపాధ్యాయులు స్వప్న, శౌరి,జహేదా బేగం,అనిత,సుధ విద్యార్థినులు పాల్గొన్నారు.




# తాత మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి!

## ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ నిరసన హోరు.



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 7, (జనం వాయిస్):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వైఖరిని నిరసిస్తూ ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకని విజయ్ మాదిగ నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి, చావు డప్పు కొడుతూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ తదితర ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. అధికార దాహంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజ్యాంగ వ్యవస్థలను, దళిత నాయకత్వాన్ని కించపరిచేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అత్యున్నతమైన స్పీకర్ పీఠంపై ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ ను, వారి కుటుంబ సభ్యులను అవమానించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పట్ల అభ్యంతరకరమైన భాషను ఉపయోగించిన ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే సస్పెండ్ చేసి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సభా మర్యాదలను మంటగలిపినందుకు గాను ప్రతిపక్ష నేత కేసీఆర్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొత్త కురుమ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, మంకాల దాసు, కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గౌస్ పాషా, సింగల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శికొత్త కురుమ మంగమ్మ, కౌన్సిలర్లు నీలం భాను బాబు, దారు రాఘవేందర్, భార్గవి రాజు, రామదాస్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ మహేష్ గౌడ్,పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు.

- ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి.
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్ డిమాండ్.



**మరిపెడ,సెప్టెంబర్ 08(జనం వాయిస్):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మరిపెడ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శవయాత్ర నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్ అధ్యక్షతన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా జాతీయ రహదారిపై ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాతా మధు దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పానుగోతు రాంలాల్ మాట్లాడుతూ,శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తగదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని,లేనిపక్షంలో ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకుని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ లేని సమాజం కోసం పోరాడాలి..!

- అబ్బాయిపాలెం శిక్షణ తరగతులు ప్రారంభం.
- జిల్లా కార్యవర్గ సభ్యులు అలవాల వీరయ్య.






**మరిపెడ,సెప్టెంబర్ 08(జనం వాయిస్).** ఈ దేశంలో 140 కోట్ల ప్రజల ఆస్తి 300 మంది పెట్టుబడిదారులవద్ద పోగు అయింది,దోపిడి చేయడం వల్ల దేశ సంపద కొల్ల గొట్టంవల్ల ప్రజల ఆర్థిక అసమానతలతో దోచిందని,కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య పిలుపునిచ్చారు. సిపిఐ (ఎం) మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం అబ్బాయి పాలెం గ్రామంలో ఘనంగా ప్రారంభమైన, ఈ క్లాసులకు ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు ఎర్ర వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాల వల్ల కార్మికులకు రైతులకు ఉద్యోగ ఉపాధి రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. నూటికి 80 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీ రైతుల బ్రతుకులు ప్రభుత్వ విధానాల మూలాన దుర్భరమవుతున్నాయని వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో పాలకుల విధానాలను ప్రజలకు వివరించటానికి ఈ క్లాసులు ఉపయోగపడాలని,కార్యకర్తలు గ్రామాలు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అధ్యక్షత వహించగా ఖమ్మం జిల్లా సిపిఎం నాయకులు స్టడీ సర్కిల్ ఇంచార్జ్, బోడపట్ల రవీందర్ మతం మతతత్వం అంశంపై క్లాస్ బోధించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిన్నా లచ్చన్న,కొండ ఉప్పలయ్య, బోడపట్ల రాజశేఖర్, మమత, వార్డు సభ్యురాలు నందిపాటి ఉప్పలమ్మ వెంకన్న, బాణాల రాజయ్య, నాయకులు షరీఫ్, ఆల్లి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి,జినక సైదులు, జామ్మూర్తి, కామెంల్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

# కురవి వీరభద్రస్వామి ఆలయంలో ఆదిత్య ప్రత్యేక పూజలు

- టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత కుమారుడు ఆదిత్యకు కేశవరాజు రాజేష్ సంఘం హర్షిత్ ఘన స్వాగతం.
- విద్యార్థుల కోసం ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం.
- విద్యార్థులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నా ఆదిత్య.


**కురవి, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):** టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత కుమారుడు ఆదిత్య మంగళవారం కురవి మండల కేంద్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కురవి హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ఆదిత్య సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదిత్యను కలిశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తదుపరి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు కేశరాజు రాజేష్, గజ్జల కార్తీక్, దాసు కత్తి, వినయ్, ఫోటోగ్రాఫర్ సంతోష్, దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.





# కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ పోరుబాట

## తుర్కయంజాల్ లో నిరసన





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8, (జనం వాయిస్):** 100 రోజుల్లో 420 హామీలు అమలు చేస్తామని గొప్పలు చెప్పి, 1000 రోజులు గడుస్తున్నా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తుర్కయంజాల్ లోని బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో లో మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కనీసం ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి, మిగిలిన 800 రోజుల పాలనలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అభివృద్ధి చేసేలా ఆ ప్రభుత్వ నేతలకు బుద్ధి, జ్ఞానం కలగాలని ఆకాంక్షించారు.

### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై విమర్శలు

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తీరుపై మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు ఈ ఎమ్మెల్యే రిబ్బన్లు కట్ చేస్తూ ప్రారంభోత్సవాలకే పరిమితమయ్యారని, సొంతంగా ఒక్క అభివృద్ధి పని కూడా తీసుకురాలేదని ఆరోపించారు. కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి పేరు పక్కన మీ కుటుంబ సభ్యుల పేర్లు పెట్టడం ఏంటని, దేవుడి పేరును కూడా రాజకీయ ప్రచారానికి వాడుకోవడం సిగ్గుచేటని అన్నారు. నియోజకవర్గంలో ఏ అభివృద్ధి పని జరగాలన్నా ఎం. ఆర్. ఆర్ ట్యాక్సులు వసూలు చేస్తున్నారని, కాంట్రాక్టర్లను, వ్యాపారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి సొంత అభివృద్ధి కోసం ఢిల్లీకి ప్రయాణాలు చేస్తున్నారని, నీ కారు ఎవరి పేరు మీద ఉంది? ఆ కారును ఎందుకు కొన్ని రోజులు దాచిపెట్టావు? అంటూ సూటిగా ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు అలాగే ఉన్నాయని, బీఆర్ఎస్ హయాంలో మంజూరైన పనులను కూడా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్) :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్ కుమార్, సంబంధిత అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధుపై అనర్హత వేటు వేయాలి

## కులపరమైన వ్యాఖ్యలను ఖండించిన టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి శ్రీధర్.



**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):** శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత, కులపరమైన వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం పిలుపు మేరకు నిర్వహించిన '1000 డప్పుల దరువు' శాంతియుత నిరసన కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పర్తి శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు వారిని అరెస్టు చేసి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే పోలీస్ స్టేషన్‌లోనూ నాయకులు డప్పులు వాయిస్తూ నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులతో జరిగిన తోపులాటలో తిప్పర్తి శ్రీధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా తిప్పర్తి శ్రీధర్ మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని అన్నారు. శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాత మధు తన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పడంతో పాటు పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శాసన మండలి నిబంధనల ప్రకారం ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని శ్రీధర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు మాత్రం తావులేదన్నారు. అలాగే ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఘటనపై స్పందించి ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలను ఖండించాలని, దళిత సమాజానికి, శాసనసభ స్పీకర్‌కు తక్షణమే క్షమాపణలు చెప్పాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శేషం కిరణ్, మీసాల సురేష్, పడిశాల జాన్, అమర్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంక్షేమానికి కృషి చేస్తా

**తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గండి సాయిబాబు గౌడ్ నియామకం.**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**
తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గండి సాయిబాబు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్రయ్య గౌడ్ చేతుల మీదుగా సాయిబాబు గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గండి సాయిబాబు గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గౌడ జాతి అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు అందేలా కృషి చేస్తానని, గౌడ సమాజం సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు. తనకు జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం వ్యవస్థాపకులు గట్టు రామచంద్రయ్య గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోల్కాపురి శ్రీకాంత్ గౌడ్, జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్లకు సాయిబాబు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# విద్యార్థులే రేపటి భావి పౌరులు

**పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించిన సర్పంచ్ తుడుసు నాగార్జున.**
**పాఠశాలకు 4 ఫ్యాన్లు అందిస్తానని హామీ.**



**కురవి, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**
మండలంలోని కందికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గౌరవ సర్పంచ్ తుడుసు నాగార్జున, పంచాయతీ కార్యదర్శి నరేష్, గ్రామ వార్డు సభ్యులు అంబడిపూడి ఇసాకర్, తోట మహేష్ విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుడుసు నాగార్జున మాట్లాడుతూ "నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులు" అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి పరిసరాలతో పాటు పాఠశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు ఇంటి చుట్టుపక్కల చెత్త లేకుండా శుభ్రంగా ఉంచిన విద్యార్థులను అభినందిస్తూ తనవంతుగా రూ.500 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచ్ పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని గమనించిన ఆయన, పాఠశాలకు నాలుగు ఫ్యాన్లు తనవంతుగా అందజేస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం, పరిశుభ్రత, సౌకర్యాలపై సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రం మండలంలోని కోరుకొండపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫారాల పంపిణీని, పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించేందుకు మెలకువలతో విద్యాబోధన అవసరమని అన్నారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టించడం కాకుండా, నిత్యజీవిత ఉదాహరణలతో, కథలు, ఆటలతో బోధించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి విద్యార్థికి పోషకాహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని ఎంఈవో కి సూచించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, పోషకాహార నిల్వలు, నాణ్యత, మధ్యాహ్న భోజనం మరియు బాలామృతం పంపిణీ తీరు,పాఠశాల, అంగన్ వాడీ రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందాలని, అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తక్కువ బరువు గల చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక తహశీల్దార్ వివేక్, మండల విద్యాధికారి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జి.పి ఓ నర్మద, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

**ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: శివారపు శ్రీధర్.**




**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**
హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావడంతో పాటు ప్రత్యేక హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని బట్టు అంజయ్య భవన్‌లో హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేశ్వర్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రైతు పండించిన పంటలను, పరిశ్రమల్లో తయారైన వస్తువులను ప్రజలకు చేరవేయడంలో హమాలీ కార్మికుల పాత్ర కీలకమన్నారు. రైతు ఎంత అవసరమో ఉత్పత్తి అయిన సరుకులను ప్రజలకు చేరవేసే హమాలీ కార్మికుడు కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. నిత్యం బరువులు మోస్తూ శారీరక శ్రమతో జీవనం సాగిస్తున్న హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, పెన్షన్, వైద్య సదుపాయాలు, ప్రమాద బీమా వంటి కనీస రక్షణలు లేకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు, సిమెంట్--ఎరువుల గోదాములు, పరిశ్రమలు, ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న వేలాది మంది హమాలీలు చట్టబద్ధమైన రక్షణ లేకుండా పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షించాల్సింది పోయి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను బలహీనపరుస్తున్నాయని శ్రీధర్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, ఏజెన్సీల పేరుతో జరుగుతున్న శ్రమ దోపిడీని అరికట్టాలని, సీజన్‌లో స్థానిక కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రతి కార్మికుడిని నమోదు చేయాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ప్రతి కార్మికుడికి ఈపిఈ, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా అమలు చేయాలని, ఆరోగ్య బీమా, పిల్లల విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు, వివాహ సహాయం, గృహనిర్మాణ సహాయం, మరణ పరిహారం, అంత్యక్రియల సహాయం అందించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే ప్రతి హమాలీకి ఏటా రూ.10 వేల బోనస్, యూనిఫాం కోసం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాములు, మిల్లుల్లో పనిచేసే హమాలీలకు కూడా బోనస్, యూనిఫాం సౌకర్యాలు కల్పించాలన్నారు. పని సమయంలో ప్రమాదం జరిగితే పూర్తి నష్టపరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం లేదా జీవన భృతి కల్పించాలని కోరారు. మహిళా హమాలీ కార్మికులకు ప్రత్యేక రక్షణ, ప్రసూతి సెలవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మార్కెట్లు, గోదాముల్లో తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి హమాలీకి గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. "హమాలీ కార్మికులారా.. సంఘటితం అవుదాం-- హక్కుల కోసం పోరాడుదాం. మన శ్రమకు గౌరవం.. మన జీవితానికి భద్రత సాధించుకుందాం" అని శివారపు శ్రీధర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# కురవి భూదాన్ భూమి ఎవరి అదీనంలో..?

- భూదాన్ భూమి కబ్జా కోరల్లోనా..? అధికారుల కనుసన్నల్లోనా?.
- కురవిలో ప్రభుత్వ భూములపై కబ్జా కత్తి!.
- 275 ఎకరాల 22 గుంటల భూములపై సమగ్ర విచారణకు డిమాండ్.
- పి.ఓ.టి., అసైన్డ్ భూముల అక్రమ లావాదేవీలపై కొరడా ఝుళిపించాలి.
- ఒకే అంశంపై వరుస ఫిర్యాదులు.. ఇక అధికారుల స్పందన ఎప్పుడు?.



**కురవి, సెప్టెంబర్ 8 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ, సీలింగ్, పి.ఓ.టి., భూదాన్, అబాది, ప్రజాప్రయోజన భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న, సీపీఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్నలు అధికారులకు వరుసగా ఫిర్యాదులు చేశారు.

## 275 ఎకరాలపై అనుమానాలు..,
జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయించిన భూములు ఉన్నట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ భూములు 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు, పి.ఓ.టి. భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, భూముల స్వభావం, విస్తీర్ణం, సర్వే నంబర్లు, ప్రస్తుత స్థితిగతులను అధికారికంగా నిర్ధారించాలని కోరారు.

## 177 సర్వే నంబర్‌పై ప్రత్యేక దృష్టి
కురవి గ్రామంలోని సర్వే నంబర్ 177, బై నెంబర్ల లోని ప్రభుత్వ భూములను ప్రత్యేకంగా గుర్తించి పరిరక్షించాలని పలువురు అధికారులను కోరారు. ప్రభుత్వ భూములకు క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ణయించి హద్దురాళ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి రికార్డులు, పాత రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి సమగ్రంగా పరిశీలించాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేశారు.

## అసైన్డ్ భూముల అక్రమ లావాదేవీలపై చర్యలు
పి.ఓ.టి./అసైన్డ్ భూములపై అక్రమ కొనుగోళ్లు, విక్రయాలు, ఆక్రమణలు జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల వివరాలను ప్రజలకు బహిరంగపరచాలని, పారదర్శకంగా రికార్డులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

## చెరువులు.. కుంటలపైనా కన్నేయాలి
ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు, శిఖం భూములు, కాలువల ఆక్రమణలపైనా సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. విలువైన ప్రజా ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జనం వాయిస్ కథనాలకు స్పందించిన సీపీఐ
కురవిలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్న అంశంపై 'జనం వాయిస్' దినపత్రికలో వరుసగా వస్తున్న కథనాలకు స్పందించిన సీపీఐ నాయకులు ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. సీపీఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కురవి ప్రజావాణిలో ఎంపీడీవో వీరబాబుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సర్వే నంబర్ 177తో పాటు అన్ని ప్రభుత్వ భూములను గుర్తించి రక్షించాలని వారు కోరారు.

## ఎస్సీ బాలికల హాస్టల్ మార్చాలని మరో ఫిర్యాదు
కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహం భవన పరిస్థితులను పరిశీలించి, విద్యార్థినుల భద్రత దృష్ట్యా సురక్షితమైన భవనానికి మార్చాలని దళిత నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌కు సంబంధించి సాంకేతిక పరిశీలన చేపట్టి, విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.


## ఒకే అంశంపై వరుస ఫిర్యాదులు.. ఇక అధికారుల స్పందన ఎప్పుడు?
ప్రభుత్వ భూముల పరిరక్షణ, హాస్టల్ తరలింపు, ఆక్రమణలపై విచారణ కోరుతూ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సీపీఐ నాయకులు, దళిత నాయకులు వేర్వేరుగా ఫిర్యాదులు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న, సీపీఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్నలు ఫిర్యాదులు సమర్పించారు.

## సమగ్ర విచారణ చేసి నివేదికను ప్రజల ముందుంచాలి
ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, సీలింగ్, పి.ఓ.టి., భూదాన్, అసైన్డ్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేసి, ఆక్రమణలు ఉంటే తొలగించి, పూర్తి నివేదికను ప్రజలకు వెల్లడించాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి.. వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని, నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో మరిన్ని భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం

**అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్) :**
జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో పోలీస్ బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూట్ డైవర్షన్లు చేపట్టాలని, రోడ్లపై గుంతలను పూడ్చి మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన ఘాట్ల వద్ద బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ తీగలను సరిచేసి, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జన పాయింట్ల వద్ద పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం ఘాట్లు, ప్రధాన రహదారులను వెంటనే శుభ్రం చేసేలా పారిశుధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలన్నారు. మండప నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి అనుమతులు పొందిన అనంతరం మాత్రమే మండపాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ డాక్టర్ శబరిష్ సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించి నిబంధనల ప్రకారం నిమజ్జనోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా మద్ది వినోద్ కుమార్.



**మరిపెడ,సెప్టెంబర్ 08 (జనం వాయిస్).**
మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా మద్ది వినోద్ కుమార్ (ధరావతండ పంచాయతీ కార్యదర్శి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రధాన కార్యదర్శిగా గోపీచంద్ (రాంపురం పంచాయతీ కార్యదర్శి),కోశాధికారిగా విప్లవ (అమృనాయక్ తండ పంచాయతీ కార్యదర్శి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.మండలంలోని పంచాయతీల అభివృద్ధి,పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు సమన్వయంతో పనిచేస్తామని వారు తెలిపారు.ఈ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



డైనమిక్ జనంవాయిస్ తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# రుణమాఫీ కోసం మరోసారి రైతు పోరుబాట

- అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదంటూ దళిత యువ రైతు ఆవేదన.
- పది రోజుల దీక్ష.. కలెక్టరేట్‌కు పాదయాత్ర చేసినా పరిష్కారం లేదని ఆరోపణ.
- బ్యాంకు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం.
- త్వరలో కలెక్టరేట్ ఎదుట ఒకరోజు దీక్షకు సహదేవ్ సిద్ధం.



**కురవి, సెప్టెంబర్ 8 (జనం వాయిస్) :** ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పథకం తనకు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన దళిత యువ రైతు సహదేవ్ మరోసారి పోరుబాట పట్టారు. తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే పది రోజుల పాటు దీక్ష చేపట్టడంతో పాటు కలెక్టరేట్‌కు పాదయాత్ర చేసి అధికారులకు వినతిపత్రం అందజేసినా న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీకి తాను అర్హుడినని సహదేవ్ తెలిపారు. అయినప్పటికీ తన రుణ మాఫీ కాకపోవడానికి బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. అర్హత ఉన్న రైతుకు ప్రభుత్వ పథకం అందకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

### పది రోజుల దీక్ష.. కలెక్టరేట్‌కు పాదయాత్ర

రుణమాఫీ కోసం తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు గతంలో పది రోజుల పాటు దీక్ష చేపట్టినట్లు సహదేవ్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆరోపించారు.

### అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

రుణమాఫీ కోసం బ్యాంకు కార్యాలయం నుంచి వ్యవసాయశాఖ కార్యాలయం వరకు పలుమార్లు తిరిగినట్లు సహదేవ్ తెలిపారు. ఒక్కో కార్యాలయంలో ఒక్కో సమాధానం చెప్పడంతో తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వాపోయారు. సమస్య పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తన చెప్పులు అరిగిపోయే పరిస్థితి వచ్చినా ఫలితం మాత్రం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### మళ్లీ ఆందోళనకు సిద్ధం

గతంలో చేపట్టిన నిరసనలకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో మరోసారి ఆందోళనకు దిగాలని నిర్ణయించుకున్నట్లు సహదేవ్ వెల్లడించారు. త్వరలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒకరోజు దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తానని చెప్పారు.

### అంబేద్కర్‌కు వినతిపత్రం

రైతు రుణమాఫీపై ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కురవి మండల కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ ఎందుకు కాలేదో అధికారులు స్పష్టంగా తెలియజేయాలని, సంబంధిత బ్యాంకు, వ్యవసాయశాఖ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. "అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ ప్రయోజనం అందాలి. రైతు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు సమస్యలను పరిష్కరించాలి. తనకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తా" అని సహదేవ్ స్పష్టం చేశారు.

# కేసీఆర్ మరణాన్ని కోరుతూ వ్యాఖ్యలా?

## ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు



**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 8:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరణాన్ని కోరుతూ షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె. శంకరయ్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ శాయంపేట మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఓ ప్రజా నాయకుడి మరణాన్ని కోరుతూ మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు శంకరయ్య వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యాఖ్యలను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. రాజకీయాల్లో హుందాతనం, సంస్కారం పాటించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారపెల్లి నందం, మారపెల్లి మోహన్, గడిపే విజయ్, పసుల ప్రవీణ్‌కుమార్, గాదె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేవంటున్నారు.. గుర్తింపు ఎలా వచ్చింది?

- విద్యాశాఖ--గ్రామపంచాయతీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలి.
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్.



**కురవి, సెప్టెంబర్ 8 (జనం వాయిస్) :** కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై విద్యాశాఖ, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని డా.బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. కురవి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్ భవన నిర్మాణాలకు అనుమతులు లేవని గ్రామపంచాయతీ అధికారులు స్పష్టం చేసిన నేపథ్యంలో, విద్యాశాఖ నుంచి పాఠశాలకు గుర్తింపు ఎలా లభించిందనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పాఠశాల భవన భద్రత, అదనపు నిర్మాణాలు, గ్రామపంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు తక్షణమే పరిశీలించాలని అన్నారు. ఆరోపణలు వచ్చినప్పటికీ విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని అమలు చేసి, విచారణ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ కోరారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన: బీఆర్ఎస్ నాయకులు.

**సెప్టెంబర్ 8 జనం వాయిస్ పాలకుర్తి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం, పాలకుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి, మాజీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్, జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్ రావులు మాట్లాడారు.. అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, 420 అబద్ధపు హామీలతో 1000 రోజుల పాలన కొనసాగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. నిన్న అసెంబ్లీ సాక్షిగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, పాలకుర్తి పట్టణ సర్పంచ్ కమ్మగాని విజయ- నాగన్న గౌడ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గడ్డం కిరణ్, వివిధ గ్రామాల సర్పంచులు, బానోత్ మహేందర్ నాయక్, గణపురం రేణుక సురేష్, పార్టీ నాయకులు మాటూరి యాకయ్య, పాము శ్రీనివాస్,సంగి పరుశరాములు, ఉపసర్పంచ్ గాదెపాక కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్

**జనం వాయిస్, నంగునూర్, సెప్టెంబర్ 08:** అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ బహుదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణా, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం. కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి పదిరె శ్యామ్ రెడ్డి,పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి,బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు



**జనం వాయిస్, ఖమ్మం, సెప్టెంబర్ 08:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం నాడు అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ సభ్యులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సంధర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ అక్షరాస్యతే అభివృద్ధికి బలమైన పునాది అని, అజ్ఞానాన్ని తొలగించే ఆయుధం అక్షరాస్యత అని, అక్షరాస్యతే సమాన అవకాశాలకు తొలి మెట్టు అని, అక్షరాస్యత పెరిగితే సమాజంలో చైతన్యం పెరుగుతుందని త్వరలో మన వీధి మన చదువు కార్యక్రమం ద్వారా అనేకమంది నిరక్షరాస్యుల దగ్గరకు వెళ్లి చైతన్యం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేలా నరసింహారెడ్డి, పగిడి కత్తుల వెంకన్న, రంగారావు, సుధాకర్ నారాయణ, అభిమానుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ దేవరుప్పులలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 56 లక్షలు మంజూరు

## జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝూ



**సెప్టెంబర్ 8 జనం వాయిస్ పాలకుర్తి:** దేవరుప్పుల మండల పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఐవీఖీ నిధుల కింద రూ. 56 లక్షల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝూ మంగళవారం, ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కేజీబీవీ దేవరుప్పుల పాఠశాలను కలెక్టర్ సందర్శించిన సందర్భంగా విద్యార్థినులు పాఠశాల అప్‌గ్రేడ్ అయినప్పటికీ సరిపడా తరగతి గదులు లేవని కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థినుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం ఉన్న భవనంపై అదనపు గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. బాలికల విద్యకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు తగిన తరగతి గది సౌకర్యాలు అందించేందుకు అసంపూర్ణంగా ఉన్న మొదటి అంతస్తు ఎడమ వైపు, వెనుక భాగంలోని గదులను పక్కా నిర్మాణంగా పూర్తి చేయాలని రూ. 56 లక్షలతో పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేశారు. ఈ పనులను తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (౮+జుఔ×ణజ), వరంగల్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టాలని, ఆమోదించిన అంచనాలు, నాణ్యత ప్రమాణాలు, ఎస్ఎస్ఆర్ 2025--26 నిబంధనలకు అనుగుణంగా పనులను తక్షణమే ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, జియో ట్యాగ్డ్ ప్రోగ్రెస్ ఫొటోలు, నాణ్యత తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని, మంజూరైన నిధుల పరిమితిలోనే పనులను పూర్తి చేసి, పురోగతి నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

# సెప్టెంబర్ 11న జాబ్ మేళా నిర్వహణ...జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

**జనం వాయిస్ , పెద్దపల్లి, సెప్టెంబర్, 08:** జిల్లా ఉపాధి కార్యాలయం , టాస్క్ రీజినల్ సెంటర్, పెద్దపల్లి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 11వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని బస్ డిపో ప్రాంగణంలో ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో సెప్టెంబర్ 11వ తేదీన ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎల్ఎన్ ఎలక్ట్రానిక్స్ గ్రూప్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ సంస్థలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. ఎల్.ఎన్ ఎలక్ట్రానిక్స్ గ్రూప్‌లో అసెంబ్లీ ఆపరేటర్లు, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్లు, అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్ల పోస్టులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీ.ఫార్మ్, ఎం.ఫార్మ్ ఇతర సంబంధిత విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.18,000 నుంచి రూ.25,000 వరకు వేతనం లభిస్తుందని, ఉద్యోగ నియామక ప్రదేశాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 11వ తేదీన ఉదయం 10 గంటలకు తమ అప్‌డేటెడ్ సీవీ/రెజ్యూమ్ రెండు కాపీలు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, అప్‌డేటెడ్ ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువపత్రం ఉన్నట్లయితే దానితో జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9182117078, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ స్వాధీనం

## ముగ్గురు పెడ్లర్లు అరెస్టు

**హైదరాబాద్ సెప్టెంబర్ 8 జనం వాయిస్** నాలుగో సారి హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ ని బట్టబయలు చేసామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి అన్నారు. డ్రై గంజాను ట్రాన్స్ పోర్టు చేయటం కష్టం అవుతుందని, హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నారు. కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ పట్టుకున్నాం. కుషాయిగూడ లో ఈ ముఠాను పట్టుకున్నామని అన్నారు. ముగ్గురు పెడ్లర్లు పట్టుకున్నాం, ఇద్దరు సప్లయర్ లు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న సప్లయర్ విజయ్ కీలకం.. నాలుగు నగరాలకు హాషిష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు . విజయ్ ను పట్టుకుంటే మొత్తం నెట్వర్క్ వెలుగులోకి , ఆర్గనైజ్డ్ గా ట్రాన్స్పోర్ట్ చేస్తున్నారు. ఒక్క గ్రాము హాషిష్ ఆయిల్ రెండు నుంచి మూడు వేలకు అమ్ముతున్నారు. ఒక్కసారి ఒక్క గ్రాము తీసుకుంటే వారం రోజుల పాటు ఆ మత్తు ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదు చేసి, 107 మందిని అరెస్టు చేశాం. ఈ ఏడాది ఐదు కోట్ల రూపాయల విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

# ఇబ్రహీంపట్నంలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8,(జనం వాయిస్ ):** నియోజవర్గంలోని ప్రగతి నగర్ కాలనీలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గత నాలుగు రోజులుగా ఉత్సవాలు హోమం, అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాలు ఎంతో హట్టహాసంగా నిర్వహించగా చివరి రోజైనా మంగళవారం బోనాలు, యాట బోనాలు, అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణతో ఉత్సవాలు ముగిసాయి. ఇందులో భాగంగా స్థానికులు కాలనీవాసులు వందలాదిమంది అమ్మవారికి మేళా తాళలతో డప్పుల చప్పుల్లాతో బోనాలు సమర్పించారు. ప్రముఖుల తాకిడితో ఆలయ పరిసరాలు క్రిక్కిరిసిపోయాయి.ముత్యాలమ్మ తల్లికీ తొలి యాట బోనం సూరమోని సత్యనారాయణ కుటుంబ సభ్యులు సమర్పించారు.ప్రస్తుతం ఆలయం పునర్నిర్మాణ దశలో ఉన్నందున ఆలయ ప్రాకారాలు ప్రహరి గోడ చుట్టూ నిర్మాణాలకు భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవి రాజు , స్థానిక సీఐ ఏం. మహేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు



# మహిళా ఉద్యోగులు ఉన్న అసెంబ్లీలో చొక్కాలు విప్పుకుని అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే యశస్విని.



**సెప్టెంబర్ 8 జనం వాయిస్ పాలకుర్తి:** తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సహచర మహిళా ఎమ్మెల్యేలతో కలిసి మహిళా కమిషన్‌ను కలిసి ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధించిందని,ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ప్రదేశంలో చొక్కాలు విప్పుకుని బహిరంగంగా నిరసన వ్యక్తం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇది అత్యంత సిగ్గుచేటైన ఘటన అని,అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికపై సభ్యులు తమ నిరసనను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని,కానీ హద్దులు దాటి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని,అదేవిధంగా శాసనసభ స్పీకర్‌ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం మరింత బాధ కలిగించిందని,సభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క శాసనసభ్యుడిపై ఉందని,రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని,మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలను తేలికగా తీసుకోకూడదని,అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని,మహిళా సాధికారత, మహిళల గౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని,మహిళలను అవమానించే ఎలాంటి ప్రవర్తననైనా సహించేది లేదని యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు పలువురు మహిళా ఎమ్మెల్యేలు పాల్గొని,అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.